సాక్షి
పెద్దపల్లి
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



కమాన్‌పూర్ పీహెచ్‌సీ తనిఖీ

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు అచల, సిసిర్ కుమార్‌నస్కర్ గురువారం సందర్శించారు.



1,033 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో గురువారం 1,033 క్వింటాళ్ల పత్తి కొన్నారు. క్వింటాల్‌కు రూ.7,821 పలికింది. కనిష్టంగా రూ.6,936, రూ.7,721గా నిర్ణయించారు.

గరిష్టం/కనిష్టం
34.0 /17.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఎండ తీవ్రత అధికమవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కన్నుల పండువగా సామూహిక వివాహాలు



దంపతులను ఆశీర్వదిస్తున్న సీపీ, ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్ జన్మదినం.. శ్రీనివాస కల్యాణ మహోత్సవం సందర్భంగా గురువారం స్థానిక శ్రీకోదండరామాలయంలో రామగుండం ఎమ్మెల్యే పలువురికి సామూహిక వివాహాలు కన్నుల పండువగా జరిపించారు. విజయమ్మ ఫౌండేషన్ ద్వారా పేదజంటలకు పుస్తె, మట్టెలు, బట్టలు, వివాహ సామగ్రి అందించి ఆశీర్వదించారు. సీపీ రెమా రాజేశ్వరి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసం జన్మించిన కారణజన్ముడు కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, మూల విజయారెడ్డి, జెడ్పీటీసీ ఆముల నారాయణ, కొంకటి లక్ష్మీనారాయణ, అడ్డాల స్వరూప, దొంత శ్రీనివాస్, పెంట రాజేశ్, సాగంటి శంకర్,పులీందర్, దాతు శ్రీనివాస్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఓటు బ్యాంక్ రాజకీయాలు మానుకోవాలి



మాట్లాడుతున్న రాంనాథ్

జ్యోతినగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. గురువారం స్థానిక అన్నపూర్ణ కాలనీలో మల్కాపూర్ మండల్ అన్నపూర్ణ కాలనీ శక్తి కేంద్రం అధ్యక్షుడు ఈదునూరి చిరంజీవి అధ్యక్షతన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో స్కామ్‌ల కాంగ్రెస్‌ను, అబద్ధపు వాగ్దానాలు ఇస్తున్న బీఆర్‌ఎస్‌ను మట్టి కరిపించాలని సూచించారు. ఉచిత కరెంట్ పేరుతో ప్రజలు, రైతులను మోసం చేస్తూ సకాలంలో కరెంట్ సరఫరా చేయక ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ దళిత మోర్చా సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి, రైల్వే బోర్డు మెంబర్ క్యాతం వెంకటరమణ, కార్పొరేషన్ అధ్యక్షుడు గుండబోయిన లక్ష్మణ్ యాదవ్, మల్కాపూర్ మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







రెండోరోజూ అదే జోష్..!



బొగ్గు ఉత్పత్తిలో నిత్యం బిజీగా ఉండే కార్మికులు ఆటవిడుపుగా క్రీడల్లో పాల్గొన్నారు. 'ఫ్యామిలీ డే' కార్యక్రమంలో భాగంగా సింగరేణి సంస్థ ఆర్జీ–2 పరిధి యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





మాయమాటలతో మోసం చేస్తున్న కేసీఆర్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: రాష్ట్ర ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలతో మోసం చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ విమర్శించారు. హాథ్ సేహాథ్ జోడో యాత్రలో భాగంగా స్థానిక 32, 44 డివిజన్లలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే స్థలం ఉన్న ప్రతి పేదవాడికీ ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని, వరంగల్ డిక్లరేషన్ ప్రకారం ప్రతి రైతుకూ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, కౌలు రైతులు, రైతు కూలీలు, భూమిలేని వారికి రూ.15 వేల ఆర్థికసాయం అందిస్తామని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ ఆర్థికసాయం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతామన్నారు. పేదల కోసం రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటామన్నారు. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. నాయకులు ముస్తాఫా, కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, బొంతల రాజేశ్, మహంకాళీ స్వామి, పెద్దెల్లి ప్రకాశ్, చుక్కల శ్రీనివాస్, పూసాల శ్రీని వాస్, బీసీ విభాగం నాయకులు పెండ్యాల మహేశ్, గట్ల రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్లపల్లి యుగేందర్, పంజా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో కరచాలనం చేస్తున్న రాజ్‌ఠాగూర్

ఇంటింటికి తాగునీరు అందిస్తున్నాం

- వేసవిలో ఇబ్బందుల్లేకుండా సరఫరా
- చిన్నచిన్న సమస్యలు గుర్తించి పరిష్కరిస్తున్నాం
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో మిషన్‌భగీరథ (ఇంట్రా) ఈఈ శ్రీనివాస్

సాక్షి
ఫోన్ ఇన్



పెద్దపల్లిరూరల్: మిషన్ భగీరథ పథకం జిల్లాలో సజావుగా సాగుతోంది. జిల్లాలోని 438 హాబిటేషన్లు ఉండగా.. 321 వాటర్ ట్యాంకులు పూర్తయ్యాయి. 2,038 కిలోమీటర్ల పైప్‌లైన్ వేశాం. 1,48,286 కనెక్షన్లకు 1,48,106 కనెక్షన్లు ఇచ్చాం. ఇంటింటికీ తాగునీటి సరఫరా సాగుతోంది. అక్కడక్కడ ఏర్పడే చిన్నచిన్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తమ సిబ్బంది గ్రామాల్లో తిరుగుతున్నారని మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ శ్రీనివాస్ తెలిపారు. గురువారం 'సాక్షి' ఫోన్‌ఇన్ ద్వారా పలువురి ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న: తుర్కలమద్దికుంటలో నీరందడం లేదు..?
– ఈదునూరి జాన్, ఉప సర్పంచ్ తుర్కలమద్దికుంట పెద్దపల్లి మండలం

ఈఈ: ప్రతి ఇంటికీ 400 లీటర్ల చొప్పున నీటిసరఫరా జరుగుతోంది. నీటి లెక్కలు కచ్చితంగానే ఉంటాయి. మా సిబ్బందిని పంపించి విచారణ జరిపిస్తా.

ప్రశ్న: బామ్లానాయక్‌తండాలో నీరు రావడం లేదు..? – రాజునాయక్, సర్పంచ్, బామ్లానాయక్‌తండా, పాలకుర్తి మండలం

ఈఈ: ఆ గ్రామంలో ఇళ్లు ఎత్తు ప్రాంతంలో ఉన్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించి త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతాం.

ప్రశ్న: నిమ్మనపల్లిలో పైపులు పగిలాయి. కొన్ని ఇళ్లకు కనెక్షన్లు లేవు..? – వేల్పుల శ్రీనివాస్, నిమ్మనపల్లి, పెద్దపల్లి మండలం

ఈఈ: పైపులు పగిలినట్లు మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపించి గుర్తిస్తాం. కనెక్షన్లు లేని ఇళ్లు ఉంటే ఇస్తాం.

ప్రశ్న: బ్రాహ్మణపల్లిలో ట్యాంకు వద్ద గేట్‌వాల్వ్ లీక్ అవుతోంది. మరమ్మతు చేయించండి..
– ఓదెల రాజు, ఉపసర్పంచ్, బ్రాహ్మణపల్లి

ఈఈ: గ్రామపంచాయతీ నిధులు చిన్నచిన్న పనుల మరమ్మతుకు వినియోగించుకోవాలి.

ప్రశ్న: కాల్వశ్రీరాంపూర్‌లో నల్లాలు అలంకారప్రాయంగా ఉన్నాయి..? – కట్కూరి సత్యనారాయణరెడ్డి, కాల్వశ్రీరాంపూర్

ఈఈ: పంచాయతీ వారు పాత కనెక్షన్ల ద్వారానే సరఫరా చేస్తున్నట్లున్నారు. కొత్తగా అమర్చిన భగీరథ నల్లాల ద్వారా నీటి సరఫరా విషయమై అధికారులతో మాట్లాడతా.

ప్రశ్న: పైప్‌లైన్ డ్రైనేజీలో వేశారు.. నీరు రావడం లేదు..?– కొయ్యడ సారయ్యగౌడ్, రంగాపూర్

ఈఈ: అన్ని గ్రామాల్లో పైప్‌లైన్, నల్లా కనెక్షన్లు ఇచ్చాం. రంగాపూర్‌లో మిషన్‌భగీరథ నల్లాల ద్వారా నీటి సరఫరా జరిగేలా చూసేందుకు సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తా.

ప్రశ్న: మొగల్‌పహాడ్‌లో భగీరథ పైప్‌లైన్ పెట్రోలియం డిపో ట్యాంకుకు లీకవుతోంది..?
– చంద్రయ్య, నరేశ్, మొగల్‌పహాడ్, అంతర్గాం

ఈఈ: ఆయిల్‌డిపోకు ట్యాంకు లీకేజీ కారణంగా ఏర్పడిన సమస్య పరిష్కరించాలని సూచించాం. బోర్లను శుద్ధి చేయించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పైప్‌లైన్ ప్రాంతంలో గుంతలు తవ్వారు?
– భిక్షపతి, కాల్వశ్రీరాంపూర్

ఈఈ: పంచాయతీ సిబ్బంది తవ్వి ఉండొచ్చు. ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళతా.



మల్లికార్జున స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



భ్రమరాంభ, మల్లికార్జునస్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కల్యాణం.. కమనీయం

ఓదెల: ఓదెల మల్లన్నస్వామి ఆలయంలో భ్రమరాంభ, మల్లికార్జునస్వామి కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు వీరభద్రయ్య, మహంతయ్య, ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, ఈవో బి.సదయ్య ఆధ్వర్యంలో కల్యాణాన్ని జరిపించారు. స్వామివారికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లకు ప్రతిపాదనలను సీఎం కేసీఆర్‌కు ఇచ్చామన్నారు. అంతకుముందు ఏసీపీ ఎడ్ల మహేశ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రదీప్‌కుమార్, ముస్కేరాజు స్వామివారిని దర్శించుకున్నారు.



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, తదితరులు

క్లుప్తంగా

రాజ్‌కుమార్‌కు జాతీయ సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణానికి చెందిన తుమ్మ రాజ్‌కుమార్‌కు జాతీయ సేవారత్న– 2023 అవార్డును మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అందజేశారు. కరీంనగర్ పట్టణంలోని ప్రెస్‌భవన్‌లో అంజలి మీడియా ఫౌండేషన్ నిర్వహించిన పురస్కారాల్లో భాగంగా అవార్డు స్వీకరించారు. కార్యక్రమంలో టీవీ చైర్మన్ రాజు పటేల్, కోఆర్డినేటర్ రాగి కుమార్, తిరుపతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



చదరంగం ఆడుతున్న క్రీడాకారిణులు

పెద్దపల్లిరూరల్: కేసీఆర్ జన్మదినం సందర్భంగా గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి చెస్‌పోటీల్లో ప్రతిభ చాటిన వారు రాష్ట్రస్థాయిలో రాణించాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి తిరుపతిరావు అన్నారు. పెద్దపల్లి అమర్‌చంద్ కల్యాణ మండపంలో క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మహిళా చదరంగం పోటీలు ప్రారంభించి మాట్లాడారు. మూడు రౌండ్లపాటు జరిగిన పోటీల్లో విజేతలను ఎంపికచేశారు. ప్రథమస్థానంలో విజేత, ద్వితీయ స్థానంలో వినీల నిలిచారు. వీరిద్దరూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీని కలిసిన కార్మిక సంఘాలు

రామగుండం: నగరంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం సమస్యలపై గురువారం వివిధ కార్మిక సంఘాల నేతలు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్యను కలిశారు. విద్యుత్ కేంద్రంలో నెలకొన్న సమస్యలు, ఇటీవల నిలిపివేసిన బొగ్గు, ఆయిల్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. ఐదేళ్లకోసారి విద్యుత్ కేంద్రం పునరుద్ధరణ, ఆధునీకీకరణ పనులు చేయాల్సి ఉండగా.. 2014 నుంచి అనుమతి ఇవ్వకపోవడంతో సాంకేతిక లోపాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. మరమ్మతుకు రూ.20కోట్లు వెచ్చిస్తే 2030 వరకు ఆటంకాలు లేకుండా విద్యుత్ కేంద్రం నడిపించుకునే అవకాశం ఉంటుందని సీఎండీ, డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సీఎండీని కలిసిన వారిలో కార్మిక సంఘాల నేతలు అబ్దుల్ తఖీ, బొడ్డు యాదగిరి, ఎండీ.సలీం, తాటిపెల్లి కృష్ణమూర్తి, గుర్రాల నర్సింహులు, గుర్రం కుమారస్వామి, నూనె రాజు తదితరులున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని మృతితో 'ఖని'లో విషాదం



వెన్నలవర్ధిని(ఫైల్)

గోదావరిఖని(రామగుండం): కర్ణాటక రాష్ట్రం కుప్పబడ్నేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గోదావరిఖనికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని కొత్త వెన్నల వర్ధిని (20) గురువారం మృతి చెందడంతో గోదావరిఖనిలో విషాదం నెలకొంది. హైదరాబాద్‌లో యానిమేషన్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆమె తన స్నేహితులతో కలిసి కారులో కర్ణాటక వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. కారు వేగంగా కల్వర్టును ఢీకొనడంతో నుజ్జునుజ్జయి అందులో ఉన్న నలుగురూ మృతిచెందినట్లు తెలుస్తోంది. ప్రమాద ఘటన తెలియడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. స్థానిక రమేశ్‌నగర్‌లో ఉంటున్న మృతురాలి తండ్రి కొత్త శ్రీనివాస్ లేయర్ కోళ్ల వ్యాపారి. ఈయనకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు వెన్నలవర్ధిని. ఆమె మృతదేహాన్ని తీసుకురావడానికి కుటుంబ సభ్యులు కర్ణాటకకు బయలుదేరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి సుందిళ్ల మూలమలుపు వద్ద జరిగిన కారు ప్రమాదంలో గాయపడిన సుందిళ్ల గ్రామానికి చెందిన అలుగొండ లక్ష్మి(32) చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికుల వివరాలు.. లక్ష్మి గోదావరిఖనిలోని ఓ మ్యాచింగ్ సెంటర్‌లో పని చేసుకుని బుధవారం రాత్రి తిరిగి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన సుంకరి రవి(రాజ్‌కుమార్) కారులో లిఫ్ట్ అడిగి ఎక్కింది. కారు సుందిళ్ల గ్రామశివారులోని మూల మలుపు జీడీకే 5ఏ ఓసీపీ వద్దకు రాగానే అదుపుతప్పి ప్రమాదానికి గురికావడంతో అందులో ఉన్న లక్ష్మి, రవికి తీవ్రగాయాలయ్యాయి. లక్ష్మిని కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. రవి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

ఆద్యంతం.. ఉత్సాహభరితం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సుధాకర్ పైప్స్ ప్రతినిధులు



జూనియర్ విభాగంలో ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల-మంచిర్యాల టీమ్‌కు బహుమతి ప్రదానం



సీనియర్ విభాగంలో వాగ్దేవి కళాశాల- మంచిర్యాల జట్టుకు బహుమతి ప్రదానం

- ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజినల్ టోర్నమెంట్
- సీనియర్ విజేతగా మంచిర్యాల వాగ్దేవి, రన్నర్‌గా నిశిత డిగ్రీ కళాశాల
- జూనియర్ విజేతగా మంచిర్యాల ఎస్ఆర్ఆర్, రన్నర్‌గా నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

నిజామాబాద్ నాగారం: లక్ష్యాలను ఏర్పరచుకొని క్రీడల్లో కఠోరంగా సాధన చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజనల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'సాక్షి' సంస్థ క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. నగర ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో క్రీడలు చాలా అవసరమన్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఏసీపీ కిరణ్‌కుమార్ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ రాజేశ్, సురేశ్, 'సాక్షి' బ్రాంచ్‌మేనేజర్ పల్లె మహేశ్, బ్యూరో ఇన్‌చార్జి తమ్మాటి భద్రారెడ్డి, సాక్షి ఈవెంట్స్ మేనేజర్ సుమన్, క్రికెట్ కోచ్ ఫారస్, గ్రౌండ్‌మన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.

విజేత జట్లు

- సీనియర్ విభాగంలో విన్నర్‌గా మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల, రన్నర్ గా నిజామాబాద్ నిశిత డిగ్రీ కళాశాల
- జూనియర్ విభాగంలో విన్నర్‌గా ఎస్ఆర్ఆర్ మంచిర్యాల, రన్నర్‌గా నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఆరు పరుగుల తేడాతో..

సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల, నిశిత డిగ్రీ కళాశాల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచి వాగ్దేవి కళాశాల జట్టు బ్యాటింగ్ చేసి 12 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. సాయి వినయ్ 27, సాయికృష్ణ 19 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిశిత కళాశాల జట్టు 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. 6 పరుగుల తేడాతో మంచిర్యాల వాగ్దేవి కళాశాల జట్టు విన్నర్‌గా నిలిచింది.

అద్భుత ఇన్నింగ్స్‌తో..

జూనియర్ విభాగంలో ఎస్ఆర్ఆర్ మంచిర్యాల కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచి ఎస్ఆర్ఆర్ జట్టు 12 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. కృష్ణతేజ 24 పరుగులు చేశాడు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 12 ఓవర్లలో 65 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయ్యింది. ఎస్ఆర్ఆర్ మంచిర్యాల జట్టులో సంతోష్ హ్యాట్రిక్‌తో పాటు మొత్తం 4 వికెట్లు తీసుకుని మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించారు.

జట్టు విజయానికి హ్యాట్రిక్ ఉపయోగపడింది



ప్రత్యర్థి జట్టు నడ్డివిరవడానికి నేను తీసుకున్న నాలుగు వికెట్లు ఎంతగానో ఉపయోగపడ్డాయి. హ్యాట్రిక్ తీయడం సంతోషంగా ఉంది. గతంలో కూడా టోర్నమెంట్‌లలో హ్యాట్రిక్ తీశాను. రీజనల్ స్థాయి పోటీల్లో నా బౌలింగ్ బాగా రావడానికి చాలా రోజుల నుంచి శ్రమించా. శ్రమకు తగిన ఫలితం లభించింది.

– సంతోష్, ఎస్ఆర్ఆర్ మంచిర్యాల కళాశాల

క్రీడాకారులను ప్రోత్సహించడానికే..



క్రీడాకారులను ప్రోత్సహించడానికే 'సాక్షి' నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్ చేశాము. 'సాక్షి' ముందుండి వివిధ రకాల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది. మా సంస్థ 'సాక్షి' క్రీడాకారులను ప్రోత్సహించే టోర్నమెంట్‌లకు సపోర్టుగా ఉంటుంది.

– రాజేష్, సుధాకర్‌పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్

'సాక్షి'కి ప్రత్యేక అభినందనలు



'సాక్షి' సంస్థ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కొన్ని సంవత్సరాలుగా క్రికెట్‌తో పాటు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. 'సాక్షి' చేస్తున్న కృషికి మా సంస్థ తరఫున చిరుసాయం చేస్తున్నాం. ఇందుకు 'సాక్షి'కి ప్రత్యేకంగా అభినందనలు.

– సురేష్, సుధాకర్ పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్

బొగ్గుబాయి వార్తలు

మోసపూరిత టీబీజీకేఎస్‌ను నిలదీయాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): సమస్యల పరిష్కారంలో విఫలమైన మోసపూరిత టీబీజీకేఎస్‌ను నిలదీయాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం జీడీకే–11గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ లాభాల్లో నడిచే సింగరేణిని ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్త శుద్ధి ఉన్నా ప్రైవేటీకరణ చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. భూపాలపల్లి ఏరియాలో 46 మంది కార్మికులను నిర్దాక్షిణంగా డిస్మిస్ చేస్తే గుర్తింపు సంఘం ఇంత వరకు ఒక్కమాట కూడా మాట్లాడలేదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగి నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. తలాపున గోదావరి ఉన్నా కార్మిక కుటుంబాలకు కనీసం తాగు నీరు అందించలేని దుర్భర పరిస్థితి నెలకొందన్నారు. సంస్థకు అనుబంధంగా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని హైవేపై ఫ్లైఓవర్ లేక పదుల సంఖ్యలో కార్మికులు రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారన్నారు. గుర్తింపు సంఘం నాయకులు కేవలం పైరవీలకు పరిమితమయ్యారని విమర్శించారు. గేట్ మీటింగ్‌లో నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, గుమ్మడి కుమారస్వామి, సంపత్, లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్, సదానందం, రవీందర్‌రెడ్డి, మార్కండేయ, రాజేందర్, బర్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటమాడుతున్న యాజమాన్యం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రియాజ్‌అహ్మద్

గోదావరిఖని(రామగుండం): కార్మికుల ప్రాణాలతో యాజమాన్యం చెలగాటమాడుతోందని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం జీడీకే–5 ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అంతకముందు సైటాఫీస్ ఆవరణలో హెచ్ఎంఎస్ జెండా ఎగురవేశారు. విషయవాయువులతో కార్మికుల ప్రాణాలు పోయే పరిస్థితి ఉందన్నారు. దీనిపై యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికవాడల్లో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని, కొత్తడంపర్లు కొనుగోలు చేయాలన్నారు. పదోన్నతులు వెంటనే కల్పించి, ప్రైవేట్, సింగరేణి యంత్రాలు, భారీ వాహనాలు నడిపేందుకు వేర్వేరు రహదారులు, కార్మికులకు రెస్ట్ షెల్టర్ ఏర్పాటు చేయాలన్నారు. గేట్ మీటింగ్‌లో నాయకులు జక్కుల నారాయణ, దావు రమేష్, సమ్మయ్య, మోహన్, రాంచందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ముట్టడి విజయవంతం చేయండి




కార్మికులతో వెంకన్న

రామగిరి(మంథని): కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించి సీఎంపీఎఫ్ లెక్కలు చూపకుండా జాప్యం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 20న చేపట్టనున్న జీఎం కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. గురువారం సెంటినరీకాలనీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్లుగా కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు చూపకుండా నిర్లక్ష్యం చేస్తున్న సింగరేణి యాజమాన్యం మొండి వైఖరి వీడాలని కోరారు. ఇటీవల సీఎంపీఎఫ్ అధికారులు సింగరేణి యాజమాన్యంతో నిర్వహించిన మీటింగ్‌లో జరిగిన చర్చలను దృష్టిలో పెట్టుకొని కాంట్రాక్ట్ కార్మికుల ఏడు శాతం పెన్షన్ డబ్బులు వెంటనే చెల్లించి సీఎంపీఎఫ్ పూర్తి వివరాలు కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే సింగరేణి వ్యాప్తంగా కార్మిక వర్గం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మల్లేష్, నాగరాజు, మోహన్, సదయ్య, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పటి జాతరే వేరు!

- శివరాత్రి జాతరపై నాటి పెద్దల ముచ్చట్లు
- ఎడ్ల బండ్లపై రాక.. పది రోజుల ప్రయాణం
- మూడునాలుగు రోజుల సంబరం

వేములవాడ: మహాశివరాత్రి పండుగకు రెండు రోజుల ముందే ముల్లె..మూట సర్దుకుని ఎడ్ల బండ్లను సిద్ధం చేసుకుని కుటుంబంతో సహా రాజన్న దర్శనానికి బయలుదేరేవాళ్లు. మూడు కమాన్ల వద్ద ఎడ్లబండ్లను నిలిపి.. కాలినడకన వచ్చి గుండంలో స్నానం చేసి.. రాజన్నకు మొక్కులు చెల్లించేవాళ్లు. మళ్లీ ఎడ్లబండ్ల వద్దకు చేరుకుని జాగరణ దీపం వెలిగించేవాళ్లు.. నాటి వైభవం.. పేదల దేవుడు.. రైతులపాలిట అన్నదాతగా నాడు.. నేడు కొలువబడుతున్న ఎములాడ రాజన్న సన్నిధిలో నాటి నుంచి నేటి వరకు జరుగుతున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాలపై నాటి తరం జాతరపై అప్పటి వారి అనుభవాలతో 'సాక్షి' పాఠకులకు అందిస్తున్న ప్రత్యేక కథనం..



నాటి రాజన్న గుడి ముందు భాగం



నాటి ధర్మగుండం



ఈ ఫొటోలో కనిపిస్తున్న పెద్దాయన పెద్ది నారాయణ. ఈయనది వేములవాడ. వయస్సు 95ఏళ్లు. చిన్నతనంలో జాతర ఉత్సవాలపై ఇలా చెబుతున్నారు. జాతర గ్రౌండ్‌లో అన్ని పొలాలే ఉండేవి. కచ్రాలపై భక్తులు రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే వారు. మూడు కమాన్లు ఉండేవి. ఈ కమాన్ల వద్ద నుంచి గుడికి నడిచి వెళ్లే వాళ్లు. నయాపైసా, సత్తుపైసా, ఇత్తడి పైసా, నవాబుపైసాలతో రైతులు కొనుక్కునే వారు. నాటి జాతర సంబరమే వేరు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి లైశెట్టి మల్లేశం. వీరిది వేములవాడ. రైతు కుటుంబంలో పుట్టారు. నాడు ఇంతమంది జనం వచ్చేవారు కాదనీ, గంగ అవతలి వాళ్లు వచ్చేవారనీ, ఎండ్లబండ్లపై పది రోజులపాటు ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుని దర్శనాలు ముగించుకుని మళ్లీ ఎండ్లబండ్లపైనే తిరిగి వెళ్లేవారు. అప్పుడు గుండానికి తంతెలు లేవు. చెరువు, గుండం కలిసే ఉండేవి. చెరువు నీళ్ల తియ్యగా ఉండేవి. అప్పటి రైతులు నిజకోడెలే ఎక్కువ సమర్పించేవారు. కచ్రాలపై చేరుకుని చుట్టూ కచ్రాలు నిలిపి మధ్యలో దీపాలు పెట్టుకుని జాగరణ చేసేవాళ్లు. అప్పుడు చారానాకు కొబ్బరికాయ దొరికేది.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది పొజ్జల రాజన్న అర్చకులు. ఇతను 1977 నుంచి మొన్నటి వరకు ఆలయంలో అర్చకుడిగా పని చేశారు. నాటి భక్తి నేడు లేదని చెబుతున్నారు. అప్పుడు భక్తుల రద్దీ తక్కువగా ఉండేది. ఈజీగా దర్శనాలు జరిగేవి. అప్పుడున్న ప్రశాంతత ఇప్పుడు లేదు. అంతా ఆర్టిఫిషియల్‌గా మారింది. గర్భగుడి ముందు ఓ చెక్కను అడ్డంగా పెట్టేవాళ్లు. వీవీపీలు వస్తే చెక్కను జరిపి గర్భగుడిలోకి తీసుకెళ్లి దర్శనాలు చేయించేవాళ్లం. ప్రాతఃకాల పూజ అయ్యే వరకు గుడి తలుపులు తీయకపోయేది. రూ. 25కే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించేవాళ్లం. రూ.11కు ఏకవారాభిషేకం, రూ.10 కోడె టికెట్టు. మొలుగుకు చెందిన ఆర్యవైశ్యులు ధర్మశాల కట్టించారు. మానుకోట లంబాడాలు ప్రతిఏటా 20 నుంచి 30 కోడెలు తీసుకొచ్చి రాజన్నకు సమర్పించేవాళ్లు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి దొర బాలయ్య. చిన్ననాటి నుంచి ఇప్పటి వరకు జాతరలు చూస్తూనే ఉన్నారు. నాటి జాతరలో కట్టకింద నుంచి లక్ష్మీపూర్ వరకు ఎండ్లబండ్లు నిలిచేవి. రోడ్లు సరిగా లేవు. కాలినడకనే ఎక్కువ. అప్పటి జాతర సంబురం ఇప్పుడు లేదు. జాతరకొస్తే కనీసం మూడు నుంచి నాలుగు రోజులు ఉండే వారు. గాంధీనగర్‌లో గొంగళ్లు తీసుకొచ్చి గొళ్లోళ్లు అమ్ముకునే వారు. వీటిని మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు ఇక్కడి నుంచి కొనుక్కుని వెళ్లేవాళ్లు.



15 ఏళ్ల నుంచి కల్యాణకట్టకు వెళుతున్న. చిన్నతనంలో కచ్రాల్లో వచ్చి జాగరణ పూర్తయిన తర్వాతనే తల నీలాలు తీసుకునే వాళ్లు. అప్పుడు మేం కూడా చాలా తక్కువ మంది వచ్చేవాళ్లం. యాత్రికులు కూడ చాలా తక్కువ వచ్చేవారు. గుడారాల్లో, పందిళ్లు, చీరలు అడ్డం కట్టుకుని జాతరా గ్రౌండ్‌లోనే ఉండేవాళ్లు. కత్తెర్లు తీస్తే మాకు చారానా ఇచ్చేవాళ్లు.

– సాగారం భూమయ్య, నాయీబ్రాహ్మణులు

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జీఎం మనోహర్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని ఆర్జీ–2 జీఎం మనోహర్ అన్నారు. గురువారం రాత్రి ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టర్–3 సింగరేణి పాఠశాలలో నిర్వహించిన 46వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యను అతి తక్కువ ఫీజుతో సింగరేణి పాఠశాలల్లో అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10వ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ డీవైజీఎం పర్సనల్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, ఆర్జీ–2 ఎస్ఓటు జీఎం అబ్దుల్ సలీం, పాఠశాల హెచ్.ఎం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ స్టాఫ్ ధర్నా



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న మైనింగ్ స్టాఫ్

గోదావరిఖని(రామగుండం): భూపాలపల్లి ఏరియాలో డిస్మిస్ అయిన మైనింగ్ స్టాఫ్ ప్రకాశ్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మైనింగ్ సూపర్ వైజర్లు గురువారం ఆర్జీ–2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం ఎ.మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాదాసి రామ్మూర్తి, తొంగల బానేశ్, కల్లెపు అనిల్, మల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

'కంటి వెలుగు'ను ఆరోగ్యశ్రీలో చేర్చాలి



డాక్టర్ నగేశ్

ధర్మారం(ధర్మపురి): కంటి వెలుగు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో చేర్చాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. గురువారం ధర్మారంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం కంటి వెలుగు పేరుతో హడావుడి చేయడం సరికాదని, ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధి ఉంటే ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలన్నారు. పథకాన్ని కేవలం రెండు నెలలకే పరిమితం చేయకుండా ఆరోగ్యశ్రీలో చేర్చి నిరుపేదలకు కంటి అద్దాలు అందించి, ఆపరేషన్లు చేయించాలని డిమాండ్ చేశారు. కంటివెలుగు శిబిరాల్లో కేవలం రూ.100 విలువైన అద్దాలు ఇస్తున్నారని ఆరోపించారు. కంటి సమస్యలతో 80 శాతం మంది నిరుపేదలు, వృద్ధులు బాధపడుతున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా కంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

హై టెన్షన్ లైన్‌ల కింద నిప్పు పెట్టొద్దు

రామగిరి(మంథని): రామగుండం పరిధిలో 400 కేవీ విద్యుత్ లైన్ (హై టెన్షన్ లైన్)ల కింద నిప్పు పెట్టవద్దని పవర్ గ్రిడ్ చీఫ్ మేనేజర్ పవన్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని రత్నాపూర్‌లో రామగుండం పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హై టెన్షన్ లైన్‌ల కింద రైతులు తమ పత్తి, కంది, మిరప, జొన్న, చెరుకు మొదలగు పంటల నుంచి మిగిలిపోయిన గడ్డి, చెత్తను తగలపెట్టొద్దని పేర్కొన్నారు. హై టెన్షన్ లైన్‌ల కింద మంటలు పెడితే కరెంటు సరాఫరాకు అంతరాయం కలుగుతూ, విద్యుత్ ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఇంజినీర్ మహేందర్, పంచాయతీ సెక్రెటరీ రమ్య, రైతులు జక్కుల రాజయ్య, ఉడుత మల్లయ్య, సందవెన కుమార్, మేకల రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.